ఘంటారావమ్
జనరల్
General
శుక్రవారం
25 సెప్టెంబర్, 2026
www.ghantaravam.com



# ఉపాధ్యాయులకు పని భారం తగ్గించాలి

**వీణవంక, ఘంటారావమ్:**



ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ పని భారాన్ని తగ్గించాలని కోరుతూ గురువారం మండల విద్యాధికారి కె.శోభారాణికి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడారు. పిఎస్, యుపిఎస్ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ అమలులో భాగంగా పని భారం అధికం కావడం వలన ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారనీ తెలిపారు.అందులో ఆన్లైన్ పనులు ఎఫ్ఆర్ఎస్ వర్క్ఏక్ పెడ్ మా కే నామ్, ఎస్సెచ్విఆర్, స్పర్శ,ప్రశస్త్, తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్,ఐఎస్ఎంఎస్ పోర్టల్,ఎఫ్ఎల్ఎన్ ఆన్లైన్ ఎక్సమ్, అడ్మిషన్స్ అలాగే ఆఫీస్ పనులకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ వివిధ నివేదికల తయారీ, నెలవారి సమావేశాలు,శిక్షణ కార్యక్రమాలు,అధికారిక పనులు,18 రకాల విషయాల బోధన, హాజరు శాతం పెంచడం,అభ్యసన ఫలితాల నమోదు, డేటు డే పనులు, రెమిడేషన్ టీచింగ్, ఎఫ్ఎల్ఎన్ అభ్యసన ఫలితాలు,టెక్స్ట్ బుక్స్,వర్క్ బుక్స్ నిర్వహణ,మూల్యాంకనం, టిఎల్ఎం తయారీ, పాఠ్యప్రణాళిక అనేక లక్ష్యాలను నిర్దేశించడం జరుగుతున్నదను తెలిపారు. అదే విధంగా డీఈవో, ఏఎంఓ,ఎఫ్ఎల్ఎన్ పర్యవేక్షణ బృందం,కలెక్టర్ బృందం, ఎంఈఓ,కాంప్లెక్స్ హెచ్ఎం తదితరుల పర్యవేక్షణ కూడా నిరంతరం ఉండడం వలన పాఠశాలల్లో పని చేసే ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి లో నవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పాఠశాలలో ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండడం వారిపై ఇతర అదనపు పనులు కూడా ఉండడం వలన ఒత్తిడి మరింత పెరుగుతోందనీ తెలిపారు. ఇటీవల ప్రశాంత్ అనే చిల్వకోడూరు గ్రామం గొల్లపల్లి మండలం జగిత్యాల జిల్లా ఉపాధ్యాయుడు కాంప్లెక్స్ సమావేశాలలోనే నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బాధ కలిగించే విషయం అని గుర్తు చేశారు.ఇలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులపై ఉన్న ఎఫ్ఎల్ఎన్ పని భారాన్ని తగ్గించాలని, వారి మానసిక ఒత్తిడిని తగ్గించే చర్యలు తక్షణమే చేపట్టాలని కోరుతున్నామనీ తెలిపారు. ఉపాధ్యాయులను బోధనకు సంబంధించిన పనులకు మాత్రమే వాస్తవికంగా ఉపయోగించాలని తగిన విధంగా ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా కోరారు.

## ప్రశాంత్‌నగర్ గణపతి మండపంలో మహాన్న సమారాధన

### చింతకింది గోవర్ధన్‌గౌడ్ ఆధ్వర్యంలో 2500 మందికి అన్న ప్రసాద వితరణ





**శేరిలింగంపల్లి, ఘంటారావమ్ :**

శేరిలింగంపల్లి ప్రశాంత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం గణనాథ మండపం వద్ద బిజెపి రాష్ట్ర నాయకుడు చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం మహా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా 2500 మందికి పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన పుట్టిన రోజు సెప్టెంబర్ 17 మొదలు అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చింతకింది గోవర్ధన్ గౌడ్ తెలిపారు. ఈ క్రమంలోనే వినాయక నవరాత్రి ఉత్సవాలలో ఐదు గణనాథ మండపాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించాలని సంకల్పించానని అన్నారు. ఆదర్శ్ నగర్ కాలనీ, లింగంపల్లి రేయిన్ ట్రీ కమ్యూనిటీ, గోపి నగర్ బజరంగ్ యూత్ గణనాథ మండపాల వద్ద వెయ్యి మంది చొప్పున ఇప్పటికే అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉత్సాహంగా పూర్తి చేశామన్నారు. ప్రశాంత్ నగర్ కాలనీ గణనాథ మండపం వద్ద 2500 మందికి పైగా అన్న ప్రసాద వితరణకు అవకాశం కల్పించిన కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, పరిసర కాలనీల ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి ఇంట్లో చండీయాగం

### నాగిళ్ళ షణ్ముఖ పద్మనాభ అవధాని ఆధ్వర్యంలో నిర్వహణ

**హన్మకొండ, ఘంటారావమ్:**



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో గణపతి నవరాత్రి మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఓరుగల్లులోని ప్రాచీన దేవాలయం కాకతీయుల ఆరాధ్య దైవం శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవాలయ వేద పండితులు నాగిళ్ళ షణ్ముఖ పద్మనాభ అవధాని, గణపతి నవరాత్రి ఉత్సవ బ్రహ్మ శ్రీ పెండ్యాల లక్ష్మీ ప్రసాద్ శర్మ, శిష్య బృందం పనకంటి ప్రవీణ్ శర్మ, పాలకుర్తి దేవీప్రసాద్ శర్మ, శివరామకృష్ణ ఆధ్వర్యంలో చండీ మహాయానాన్ని నిర్వహించారు. శ్రీ హనుమద్గిరి పద్మాక్షి అమ్మవారి శరన్నవరాత్రుల ఆహ్వాన పత్రికను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి -గీతా రెడ్డి దంపతులకు అందజేసి శరన్నవరాత్రులకు ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. దేవాలయ చరిత్రను అక్కడ జరిగే పూజా కార్యక్రమాల వివరాలు అవధాని వివరించారు. ముఖ్యమంత్రి గృహంలో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరంలో కూడ చండీయాగాన్ని నిర్వహించి వారికి జగన్మాత యొక్క ఆశీస్సులు పండితుల బృందం అందజేసారు.

## ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తాం

**పరకాల, ఘంటారావమ్:**



ఉమ్మడి వరంగల్ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ ఎన్నికలు ఈ నెల 27న జరగనున్న నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తి పరకాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ఫోటోగ్రాఫర్ల సంక్షేమం, అభివృద్ధి కోసం తమ ప్యానెల్ కృషి చేస్తోందన్నారు.2023 మంది సభ్యుల సహకారంతో రూ.4కోట్ల విలువైన బ్యాంక్వెట్‌హాల్ నిర్మించామని తెలిపారు. అలాగే మరో రూ.కోటి విలువైన భూమిని కొనుగోలు చేసి ఫోటో భవన నిర్మాణానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కుటుంబ భరోసా పథకం ద్వారా ప్రమాదవశాత్తు సభ్యుడు మృతి చెందితే వారి కుటుంబానికి రూ.60 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాలతో సంబంధం లేకుండా యూనియన్ తరఫున సభ్యుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. ఫోటోగ్రాఫర్ల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న తమ 9 మంది సభ్యుల ప్యానెల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గాదె లింగమూర్తి కోరారు.

## పేదల కన్నీరు తుడుస్తున్న సేవా హస్తం

### విద్యార్థులకు ప్రోత్సాహం.. నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

**మల్కాజిగిరి, ఘంటారావమ్ :**



సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతూ ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు గౌతమ్‌నగర్ డివిజన్‌కు చెందిన సత్యనారాయణ. రాజకీయ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూనే సామాజిక సేవకు కూడా ప్రాధాన్యత ఇస్తూ తనవంతు సహకారం అందిస్తున్నారు. జయగిరి లక్ష్మీనరసింహ స్వామి నగర్‌కు చెందిన సత్యనారాయణ.. అవసరంలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు ఆలయాల అభివృద్ధికి సహకరిస్తున్నారు. కుటుంబ పెద్దలను కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి సైతం తనకు తోచిన సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు.

**రూ.2 లక్షలతో విద్యార్థులకు చేయూత**

తన స్వగ్రామం చందాయిపేటలో పీవీకే కన్స్ట్రక్షన్ పేరుతో సుమారు రూ.2 లక్షల సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆటపరికరాలు, స్కూల్ బ్యాగులు, యూనిఫాంలను పంపిణీ చేశారు.విద్యార్థుల్లో చదువుతోపాటు క్రీడా నైపుణ్యాలను పెంపొందించాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

**సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత**

మల్కాజిగిరి, గౌతమ్‌నగర్ ప్రాంతాల్లో పేద విద్యార్థులు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సహాయాన్ని అందిస్తూ సత్యనారాయణ తన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో కొనసాగుతున్న ఆయన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అనుచరుడిగా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రజా సమస్యలపై స్పందించడంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సత్యనారాయణను స్థానికులు అభినందిస్తున్నారు.



## రాజిపేటలో వైభవంగా గణపతి నిమజ్జనం

**పరకాల, ఘంటారావమ్:**

హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని పెద్ద రాజిపేటలో గణపతి నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను భక్తులు ఉత్సాహంగా ఊరేగించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిమజ్జన వేడుకల్లో కోలాటాలు, డప్పుచప్పుళ్లతో ఉత్సాహంగా గణనాథుడిని ఊరేగించారు. అనంతరం స్థానిక చిన్నఎర్రకుంటలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జన వేడుకలతో పెద్ద రాజిపేటలో పండుగ వాతావరణం నెలకొంది.



## వినాయక లడ్డూ దక్కించుకున్న ముస్లిం సోదరుడు

### ఎంతో సంతోషంగా ఉందన్న ఎస్‌కె షరీఫ్

**దుగ్గొండి, ఘంటారావమ్ :**

మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన పాత్రికేయుడు, ముస్లిం సోదరుడు వినాయకుని లడ్డూను వేలంలో సొంతం చేసుకొని హిందూముస్లిం భాయ్‌భాయ్ అనే సందేశానికి నిదర్శనంగా నిలిచారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి ఉత్సవాల్లో పాల్గొన్నానని అన్నారు. లడ్డును వేలంలో రూ.9,116కు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా, అందరం కలిసి ఉండాలని, ప్రేమాభిమానాలతో సుఖ సంతోషాలతో ఉండాలని షరీఫ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు భాషబోయిన సురేష్, వేణు, నరేష్, రాజేందర్, రాజు, రవి, ఎలకంటి కుమారస్వామి, మధుసూదన్, మహేష్, దండు రాజు, పాల్గొన్నారు.



## సఫిల్‌గూడలో ఘనంగా వినాయక పూజలు

### గణపతిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

**మల్కాజిగిరి, ఘంటారావమ్ :**

మల్కాజిగిరి నియోజకవర్గం, మౌలాలి డివిజన్ ఓల్డ్ సఫి ల్‌గూడలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శ్రీసంతోషిమాత యూత్ అసోసియే షన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మండప నిర్వాహకులు, నాయకులు, భక్తులతో ఆయన ముచ్చటించారు. కార్యక్రమంలో మండప నిర్వాహకులు సందీప్ గౌడ్, బాలసుబ్రమణ్యం, కొండారెడ్డి, భాస్కర్, సుశాంత్, శివ, భరత్, చింటు, శ్రీనివాస్, అజయ్, ఆశ్రిత్‌గౌడ్, రిషి, సామ్రాట్, బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, పిట్టల శ్రీనివాస్, వినోద్ యాదవ్, వెంకన్న, చుంకు శ్రీనివాస్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, రఘు యాదవ్, సంపత్ గౌడ్, యూసుఫ్ భాయ్, బాల్ రాజ్ యాదవ్, ఆశా, జాన్ బి, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.



## 1.75లక్షలు పలికిన లడ్డూ

### వేలంలో దక్కించుకున్న కాకతీయ స్కూల్ డైరెక్టర్ తిరుపతిరావు

**కూకట్పల్లి, ఘంటారావమ్ :**

కూకట్‌పల్లి పాపారాయుడునగర్‌లో కాకతీయ స్కూల్ డైరెక్టర్ పెండ్యాల తిరుపతిరావు వినాయకుడి లడ్డూను రూ.1.75 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. నిర్వాహకులు, భక్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఐశ్వర్యం కలగాలని తిరుపతిరావు ఆకాంక్షించారు.



## లడ్డూ కైవసం చేసుకున్న కౌన్సిలర్ పూర్ణచారి

**పరకాల, ఘంటారావమ్:**

స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలంలో పరకాల 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జెంకి పూర్ణచారి కైవసం చేసుకున్నారు. స్వర్ణకార సంఘం పెద్దలు, యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం పెద్దలు బెజ్జెంకి లక్ష్మీకాంతం, సిరికొండ శ్రీనివాసచారి, రావులకొలను నరసింహమూర్తి, తంగేళ్లపల్లి సదానందం, తొగిటి శంకరాచారి, కందుకూరి వేణు, గుగ్గిళ్ల రాజు, వంగల కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గణపతి నిమజ్జనం

**సైబరాబాద్,ఘంటారావమ్ :**

గాయత్రి నగర్ డివిజన్ 254లో వివేకానందనగర్‌లో శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రుల్లో భాగంగా 11 రోజుల పాటు సాగిన పూజలు తదుపరి సంస్కృతిక ఉట్టి కొట్టడం, కార్యక్రమాలలో చిన్నారులు, మహిళలు ఆట పాటలతో,అలాగే అన్నదానం నిర్వహించి నిమజ్జనం చేయడం జరిగింది. కార్యక్రమంలో శ్రీసాయి గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు అంజయ్య,మురళి,ముని, హరి, బాలరాజు, రమణ, నాయుడు, రాజు, అనిల్, సభ్యులు పాల్గొన్నారు.



# చిక్కుల్లో చీఫ్ ఎలక్షన్ కమిషనర్!

## రాజీనామా చేయాలని కాక్రోచ్ పార్టీ డిమాండ్. 48 గంటల డెడ్‌లైన్ విధింపు






**ఘంటారావవమ్ డెస్క్:**
చీఫ్ ఎలక్షన్ కమీషనర్ జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లోగా రాజీనామా చేయాలని కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. ఒకవేళ 48 గంటల్లోగా జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకుంటే, అప్పుడు దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నట్లు సీజేపీ తన వార్నింగ్‌లో పేర్కొన్నది. సర్ పేరుతో 13 కోట్ల ఓటర్లను తొలగించడాన్ని సీజేపీ వ్యతిరేకించింది. చీఫ్ ఎన్నికల కమీషనర్ జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లోగా రాజీనామా చేయాలని కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. ఒకవేళ 48 గంటల్లోగా జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకుంటే, అప్పుడు దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నట్లు సీజేపీ తన వార్నింగ్‌లో పేర్కొన్నది. నిరవధిక నిరాహార దీక్షకు దిగినున్నట్లు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చీఫ్ ఎలక్షన్ కమిటీసనర్ అతిపెద్ద జాతి వ్యతిరేకి అని, జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, భారత ప్రజాస్వామ్యానికి ఆయన పెను ప్రమాదంగా మారినట్లు అభిజీత్ ఆరోపించారు. ఎలక్షన్ కమీషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషిలు.. ముఖ్య ఎన్నికల అధికారిపై ఆరోపణలు చేశారు. గడిచిన 10 నెలల్లో 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశామని, కానీ పూర్తి స్థాయి ఎలక్షన్ కమిషన్ పేరుతో నిర్ణయాలు తీసుకున్నారని, తమ అనుమతి లేకుండానే ఆ నిర్ణయాలను వెల్లడించారని, సీఈసీ నిర్ణయాలు అక్రమ రీతిలో ఉన్నట్లు ఇద్దరు కమీషనర్లు చేసిన ఆరోపణలపై ఓ మీడియా కథనాన్ని రాసింది. ఈ నేపథ్యంలో సీజేపీ నేతలు ఇవాళ మీడియా సమావేశం నిర్వహించారు. సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత .. ఎవరికి ఓటు రావాలి, ఎవరికి ఓటు వద్దు అన్ని విషయాన్ని ప్రభుత్వం నిర్ణయిస్తోందని, ప్రజాస్వామ్యం అంటే ఇదేనా అంటూ అభిజీత్ ప్రశ్నించారు. సుమారు 3 కోట్ల మంది ఓటర్లను తొలగించారని, ఇదేమీ చిన్న సంఖ్య కాదు అని, , 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ, విపక్షాల మధ్య తేడా కేవలం 2 శాతం ఓట్లు మాత్రమే అని, 13 కోట్ల మంది ఓటర్లను డిలీట్ చేయడం అంటే, దాదాపు 13 నుంచి 14 శాతం ఓట్లను తొలిగించడమే అవుతుందని అభిజీత్ అన్నారు. ఆ 2 శాతం వ్యత్యాసాన్ని పెంచేందుకు జ్ఞానేశ్‌కుమార్ ప్రయత్నాలు చేస్తున్నారా అని కూడా ప్రశ్నించారు.

# సీఈసీ నియంతృత్వ ధోరణి

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సర్ ప్రక్రియలో లోపాలపై విమర్శలు

**ఘంటారావవమ్ డెస్క్:**
ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా చెప్పుకునే మన దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఎన్నికల సంఘం తీరు దాదాపు నియంతృత్వ ధోరణిలోకి వెళ్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరు పదేపదే అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పుడు, ఎన్నికల సంఘం పనితీరును సరిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ముగ్గురిలో ఇద్దరు ఒక నిర్ణయానికి వ్యతిరేకంగా ఉన్నప్పుడు అది మెజారిటీ కాదా? ఇప్పటి వరకు మెజారిటీ అంటే ఇదే కదా. ఇప్పుడు దాని నిర్వచనం కూడా మారుతున్నట్టుందని పేర్కొన్నారు. ఓటర్ల నమోదు, తొలగింపు, తొలగించిన ఓట్లను తిరిగి చేర్చడం వంటి అంశాల్లో సందేహాలకు తావిచ్చేలా నిర్ణయాలు తీసుకుంటే, 'అసలు మనం ఇంకా ప్రజాస్వామ్యం లోనే ఉన్నామా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యత ఉన్న సంస్థ పునాదులే బలహీనపడుతున్న పరిస్థితిలో దాని నిర్ణయాలకు వదిలేయలేమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాజకీయ పార్టీలు, రాజ్యాంగ సంస్థలు, పౌర సంఘాలు, ముఖ్యంగా సుప్రీంకోర్టు కలిసి ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు.



తెలంగాణలో ఓట్ల తొలగింపుపైనా కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ' తెలంగాణలో అత్యధిక ఓట్ల తొలగింపులు బీఆర్ఎస్ గెలిచిన స్థానాల్లోనే ఉండటం ఆశ్చర్యం కలిగించలేద' అని అన్నారు.తెలంగాణలో ప్రస్తుతం ఒకే పోరాటం జరుగుతున్నదని, అది ' కేసీఆర్ వర్సెస్ అందరూ' అని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు కాంగ్రెస్, బీజేపీలు కలిసి అనైతిక, అక్రమ, బహిరంగంగా ప్రకటించని కుమ్మక్కుకు పాల్పడ్డాయని ఆరోపించారు. ఇప్పుడు ఆ కుమ్మక్కులోకి ఎన్నికల సంఘం కూడా చేరుతున్నట్టుగా కనిపిస్తున్నదని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ న్యాయస్థానాల్లోనూ, ప్రజల మధ్యనూ పోరాడుతుందని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా తొలగించిన ప్రతి ఓటును తిరిగి చేర్పిస్తామని ప్రకటించారు. చివరగా ఆయన తన రాజకీయ సందేశాన్ని మరోసారి స్పష్టం చేస్తూ తెలంగాణలో ఒకే ఒక్క 'సార్' ఉన్నారు. అది కేసీఆర్ సార్. ప్రజలకు ఆయనపై ఉన్న ప్రేమను ఏ 'ఎస్ఐఆర్' కూడా ఓడించలేదు' అని అన్నారు.




## భూవివాదం కేసులో ముఖ్య సాక్షికి బెదిరింపులు

### పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన భూబాధితులు

**పర్వతగిరి,ఘంటారావమ్:**
భూవివాదం కేసులో సాక్ష్యం చెప్పాల్సిన ముఖ్య సాక్షి పుల్లూరి సతీష్ కుమార్‌తో పాటు బాధితుడు మహమ్మద్ బాబ్ జానీని గోనె సంపత్ బహిరంగంగా పర్వతగిరి చౌరస్తాలో బెదిరించాడు. వివరాల్లోకి వెలితే.. 2017లో పర్వతగిరి శివారులోని సర్వే నెం. 529/1, 530/1/2 లోనీ భూమిని బాబ్ జానీ కొనుగోలు చేసిన రెండెకరాల భూమి కి 13 లక్షల రూపాయలు గోనె సంపత్ తీసుకొని భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేయడంతో నమోదైన కేసులు (FIR 126/2018 పర్వతగిరి, OS 231/2019) అక్టోబర్ 6న కోర్టు విచారణకు ఉన్నాయి. ఆ రోజు సాక్షి రాకపోతే సాక్ష్యాధారాల ప్రక్రియను ముగిస్తామని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ?ఈ క్రమంలో, కేసులో ప్రధాన సాక్షి అయిన పుల్లూరి సతీష్ కుమార్‌ను తేదీ 23.06.2026 బుధవారం రోజు మధ్యాహ్నం 03.30 గంటలకు చౌరస్తాలో అడ్డగించిన గోనె సంపత్. కోర్టులో సాక్ష్యం చెప్పడానికి వస్తే ఊళ్లో తిరగనివ్వనని, బ్రతకనివ్వనని తీవ్రంగా బెదిరించాడు. ఈ ఘటనపై బాధితుడు అదే రోజు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ, పత్రికల్లో ఇట్టి వార్త ప్రచురితమైనపటికీ ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పోలీసుల నిర్లక్ష్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు.. సాక్షులకు తక్షణమే రక్షణ కల్పించి, నిందితుడు గోనె సంపత్ పై వెంటనే పోలీసు కేసు నమోదు చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# 22ఏ సమస్యలకు లైన్ క్లియర్!


## రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్న సర్కార్.. అనుమతులు తప్పనిసరి చేసిన ప్రభుత్వం

**ఘంటారావవమ్ డెస్క్:**
నిషేధిత జాబితాలో చేర్చిన 22ఏ భూములపై తెలంగాణ ప్రభుత్వం సంచలన ప్రకటన చేసింది. ప్రతిపక్షం బీఆర్ఎస్, బాధిత రైతుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైనందున.. రిజిస్ట్రేషన్‌కు అనుమతిచ్చింది సర్కార్. జీహెచ్ఎంసీ, డీటీసీపీ, హెచ్ఎండీఏ.. ఈ మూడింటి అప్రూవల్ ఉంటే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపింది. ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిన 22ఏలోని భూములపై కీలక ప్రకటన వెలువడింది. ఈ జాబితాలో ఉన్నా సరే రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని గురువారం సర్కార్ సర్క్యులర్ విడుదల చేసింది. జీహెచ్ఎంసీ, డీటీసీపీ, హెచ్ఎండీఏ.. ఈ మూడింటి అప్రూవల్ ఉంటే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపింది. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో లక్షలాది మందికి ఊరట దక్క నుంది. 22ఏ భూముల వ్యవహారం ఇటీవల రాష్ట్రంలో తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే.



# ట్రాఫిక్‌పై ప్రభుత్వం ప్రత్యేక నజర్

**ఘంటారావవమ్ డెస్క్:**
తెలంగాణలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌ను మరింత మెరుగ్గా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ(టీఎంఏఆర్ఎస్) బ్యూరోను ఏర్పాటు చేయనుంది. ఇందులో భాగంగా రాష్ట్ర పోలీస్ విభాగంలో ప్రత్యేక విభాగంగా టీజీ టీఎంఏఆర్ఎస్‌ను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ బ్యూరో పని చేస్తుంది. ఏడీజీపీ లేదా ఐజీ స్థాయి అధికారిని ఈ బ్యూరోకు డైరెక్టర్‌గా నియమించనున్నారు. ఇది ట్రాఫిక్ నిర్వహణ, ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై రాష్ట్రవ్యాప్తంగా పర్యవేక్షణ చేస్తుంది. హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఓఆర్ఆర్‌పై ప్రత్యేక హైవే పెట్రోలింగ్ కూడా నిర్వహిస్తుంది. రోడ్డు ప్రమాదాలపై శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు జరుపుతుంది. ప్రతి ఘోర రోడ్డు ప్రమాద స్థలాన్ని మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ పరిశీలిస్తుంది. ఈ-చలాన్లు, ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తుంది. ట్రాఫిక్ ఉల్లంఘనపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తుంది. డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్, సీట్ బెల్ట్, ఓవర్ స్పీడింగ్‌పై నిఘా ఉంచుతుంది. రిపీట్, సీరియల్ ట్రాఫిక్ ఉల్లంఘనదారులపై ప్రత్యేక నిఘా ఉంటుంది. మెట్రో, బుల్లెట్ రైలు సహా రైలు ప్రయాణ భద్రతపైనా పర్యవేక్షణ చేస్తుంది.



## నేడే బడా గణేశ్ నిమజ్జనం

**ఘంటారావవమ్ డెస్క్:**
హైదరాబాద్ ఖైరతాబాద్‌లో ఏర్పాటుచేసిన బడా గణేశ్ విగ్రహాన్ని శుక్రవారం నిమజ్జనం చేయనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు గురువారం అర్ధరాత్రి వరకు పూర్తయ్యాయి. భారీ టస్కర్ వాహనంపై తరలించేందుకు అవసరమైన వెల్డింగ్ పనులు రాత్రి 12గంటల వరకు చేశారు. అనంతరం మహాగణపతికి చివరి సారిగా పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత విగ్రహాన్ని టస్కర్ వాహనంపైకి అతి జాగ్రత్తగా చేర్చారు. శుక్రవారం ఉదయం ఆరు, ఆరున్నర గంటల సమయంలో బడా గణేషుడి శోభాయాత్రను ప్రారంభించారు. భారీ భద్రత నడుమ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పైకి తరలించనున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు విగ్రహం ట్యాంక్‌బండ్ పైకి చేర్చాలని భావిస్తున్నారు. అనంతరం భారీ క్రేన్ల సాయంతో విగ్రహాన్ని హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేస్తారు.

**భారీ బందోబస్తు..**

హైదరాబాద్ మహానగరంలో వినాయక చవితి తర్వాత నాలుగో రోజు నుంచే నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. ఐదో రోజు, ఏడో రోజు, తొమ్మిదో రోజు ఇలా రోజుల వారీగా విగ్రహాలను నిమజ్జనం చేస్తూ వస్తున్నారు. ఇప్పటి వరకు ఖైరతాబాద్ విగ్రహం మినహా దాదాపు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల నిమజ్జనం పూర్తయినట్లు తెలుస్తోంది. శుక్రవారం సాయం త్రం వరకు నిమజ్జన వేడుకలు మొత్తం ముగుస్తాయని పోలీసులు అంచనా వేసుకున్నారు. ఖైరతాబాద్ విగ్రహం నిమజ్జనం పూర్తయితే అన్ని శాఖల అధికారులు ఊపిరి తీసుకుంటారు. నిమజ్జనాల సందర్భంగా నగరంలో భారీ బందోబస్త్ ఏర్పాటు చేశా రు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట నిఘా నిర్వహిస్తున్నారు. ఇక శుక్రవారం ఖైరతాబాద్ విగ్రహం నిమజ్జనానికి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. శోభాయాత్ర పొడవునా ప్రత్యేక బలగాలను మోహరించి.. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా రక్షణ చర్యలు చేపట్టారు.



